

# రోగాలు - అనురోగాలు

## - డా.కె.వివేకానంద మూర్తి



*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*




**శర్మగారు** అనుకున్న సమయంకంటే లేటుగా వచ్చారు. నల్లతంబి భోజనం పెట్టేలోగా కబుర్లు సాగాయి.

'అన్నట్టూ యీ వారంతో హౌస్ సర్జన్సీ పూర్తి అవుతుందని చెప్పినట్టు గుర్తు. తర్వాత యేం చేద్దావని?' అనడిగారు శర్మగారు.

'పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేద్దావనే ఆలోచన వుంది. ఇక్కడా, ఇంగ్లండ్‌లోనా, అమెరికాలోనా యింకా యేమీ అనుకోలేదు. బహుశా యిక్కడే చేస్తానేమో మేష్టారూ.'

'ఇక్కడే బెటరయ్యా! ఎక్కడో యెందుకు, మనదేశమూ, మన మనుషులూ, మన భాషా, మనలోకమూ'

కరెక్టే సార్. బహుశా యిక్కడే చేస్తాను చేసేముందు వొక యేడాది సీనియర్ హౌస్ జాబ్ చేద్దామనిపిస్తోంది. ఎక్స్‌పీరియన్సు కోసం.'

'అదీ మంచిదే నీ మనసుకి అనిపించింది చెయ్యి - బాగా చెయ్యగలవు.'

'థాంక్యూ మేష్టారూ - రండి. ఫుడ్ ఫెడీ అయ్యింది మనకి' అన్నాడు బాలరాజు. ఇద్దరూ బాల్కనీలో టేబుల్ దగ్గరకు చేరారు.

పక్షుల కిలకిలా రావాల్తో, పేషెంట్ల కలకలా రావాల్తో కె.జి.హెచ్ నిద్రలేచింది. మెడికల్ వార్డులో బాలరాజు పేషెంటుని చూస్తున్నాడు. మందాకిని వూగుతూ నడుస్తోంది. పి.జి.లు వొకచోట నిలబడి నర్సు మందాకిని వైపే చూస్తున్నారు. ఎందుకంటే ఆమె వూగుతూ నడుస్తూంటే ఆమె చెస్టోజాలు వూగుతున్నాయి. వెనుక హిప్పోజాలు కూడా వూగుతున్నాయి. ఇంతలో సూపరింటెండు సూరిగారు వచ్చారు. పి.జి.లు కంగారుగా చెదిరి తలో పేషెంట్ బెడ్ దగ్గరకి సర్దుకున్నారు. సూరిగారు మందాకినితో యేదో మాట్లాడుతున్నారు. దూరం నించి బాలరాజు చూశాడు. సూరిగారు పొట్టిగా చిన్న సైజులో వుంటారు. మందాకిని టానిక్ తాగిన మన్మథ సృష్టిలా వుంటుంది. సూరిగారు ఆమె చుట్టూ తిరుగుతూ

మాట్లాడుతూంటే కుక్కపిల్ల గుర్రం చుట్టూ అటూ యిటూ తిరుగుతున్నట్టుగా వుంది. బాలరాజు తన దృష్టి మరల్చుకుని మళ్లీ కేసులు చూడ్డంలో నిమగ్నమయ్యాడు. సూరిగారు, మందాకినీ యేదో డిస్కస్ చేస్తూ డ్యూటీ రూమ్‌లోకి నడిచారు. వార్డులో తను ఫాలో అవుతున్న యిద్దరు డయాబెటిక్ పేషెంట్స్ కనిపించలేదు బాలరాజుకి. కొద్దిరోజుల క్రితం కూడా ముగ్గురో నలుగురో డయాబెటిక్ పేషెంట్స్ మిస్సయినా పట్టించుకోలేదు తను. బాగైపోయి యింటికి పోయారో లేక పోయారో అనుకున్నాడు. ఇంతకు ముందు కూడా యిలాగే అయివుండవచ్చు. తను నోటీస్ చెయ్యలేదేమో సిస్టర్ యిన్ ఛార్జ్ మందాకినిని అడిగి తెలుసుకోవాలి అనుకుంటూండగా తనే డ్యూటీ రూమ్‌లోంచి బైటికి వచ్చింది. వస్తూ 'యీ పొట్టోడికి యావెక్కువ. చేవ తక్కువ - కేసులూ, డిస్కసనూ అంటూ వొంకొకటి.' తను సూపరింటెండ్ సూరి గురించే అంటోందని తెలుసు.

'డయాబెటిక్స్ డిశ్చార్జ్ అయ్యారా సిస్టర్' అనడిగాడు.

'డిచ్చాజ్జా, పాడా - పెసల్ టిరీట్‌మెంట్ కోసం టాన్సుపరు. ఆ పొట్టి సూరిగాన్నడిగితే యివరాలన్నీ సెబుతాడు. అన్నట్టు డాట్రారూ - ఆ యెదవ మిమ్మల్నోసారి సూత్తాట్ట. యెల్లి కలవండి' అంది మందాకిని.

'అలాగా' అంటూ బాలరాజు సూరిగారున్న గదిలోకి వెళ్లాడు. సూరి కేసు నోట్సులు చూస్తూ, 'రావయ్యా! బాలరాజూ - అలా కూచో' అన్నాడు.

బాలరాజు, సూరిగారికెదురుగా కూర్చున్నాడు.

సూరిగారు చేతిలో ఫైలు మూసి పక్కన పడేసి, బాలరాజుకేసి చూస్తూ, ఆఁ - ఎలా వున్నావ్ బాలరాజూ' అనడిగాడు.

'బానే వున్నాను సార్' అన్నాడు బాలరాజు.

'ఈ వీక్‌తో హౌస్ సర్జన్సీ అయిపోతుంది కదూ - మరి ఎనీ ప్లాన్స్?' అడిగారు సూరిగారు.

'అదే ఆలోచిస్తున్నానండి.'

'ఇంకా ఆలోచనేవిటయ్యా. పి.జి కేవన్నా అప్లై చేశావా చెప్పు.'

'లేదండి. ఎక్స్‌పీరియెన్స్ కోసం సీనియర్ రెసిడెన్సీ చేస్తే యెలా వుంటుందా అనుకుంటున్నానండి.. ఇంకా డిసైడ్ చేసుకోలేదుగానీ అదే చేద్దామనిపిస్తోందండి.'

'వెరీగుడ్ మంచిదే, నీ గురించి అన్నీ మంచి రిపోర్ట్సే వస్తున్నాయి. నువ్వేం డిపార్ట్‌మెంట్ ప్రిఫర్ చేస్తావో తెలియదుకానీ, ఐ వుడ్ లైక్ టు సజెస్ట్ సమ్‌థింగ్ - కెన్ ఐ?'

'అదేంటి సార్ - తప్పకుండా చెప్పండి.'

'ఇట్స్ లైక్ ఎ రెసిడెంట్ జాబ్. ఇన్‌ఫాక్ట్ బెటర్. అండ్ విత్ బెటర్ పే.'

బాలరాజు ప్రశ్నార్థకంగా చూశాడు. సూరిగారు చెప్పారు. 'నువ్వు యిక్కడే మన కె.జి.హెచ్‌లో కంటిన్యూ చేస్తానంటే నాకు అభ్యంతరంలేదు. కానీ వొక స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ హాస్పిటల్లో యెన్నో మోడర్న్ ఫెసిలిటీస్ వున్న చోట పనిచేస్తే యింటెలిజెంట్ డాక్టరైన నువ్వు యెంతో పదునెక్కుతావ్. ఏవంటావ్?'

బాలరాజు అన్నాడు 'మీరు పెద్దవారు. మీరేం చెబితే అలాగే చేస్తాను.'

'ఓ.కె గుడ్ వాళ్లకి నువ్వొస్తావని చెబుతాను. ఖాళీ చూసుకుని వొకసారి ఆ హాస్పిటల్ డైరెక్టరుకి కనబడు.'

'ఇంతకీ ఏ హాస్పిటల్ సార్?'

'సారీ. చెప్పడం మరిచిపోయాను. నీకు తెలుసుగా 'క్యూర్' హాస్పిటల్.'

'తెలీకపోవడమేవిటి సార్. విన్నాను. వైజాగ్‌లో అందరికీ తెలిసిన హాస్పిటల్.'

'మరయితే - ఆల్ ది బెస్ట్ - నేను కదుల్తాను. యింకా అదర్ వార్డ్స్ రౌండ్స్ వున్నాయి' సూరిగారు లేచారు.

'అన్నట్టు మీతో యింకో విషయం చెప్పాలి.'

'ఏవిటి?'

'ఏం లేదు సార్. ఈ వార్డ్‌లో డయాబెటిక్ పేషెంట్స్ -' బాలరాజు నసిగాడు.

'ఓ. అదా. డోంట్యూవర్రీ అడ్వాన్స్ ట్రీట్‌మెంట్ కోసం వాళ్లు ట్రాన్స్‌ఫర్ అవుతున్నారు. ఎక్కడికో కాదు నువ్వు వెళ్లే 'క్యూర్' హాస్పిటల్‌కే. వన్స్ యు గో దేర్, యు నో మోర్' సూరిగారు లేచి కదిలారు. అర్థం కాని ముఖంతో బాలరాజు కూడా ఆయన్ని వార్డు మెయిన్ డోర్ దాకా అనుసరించాడు. సూపరింటెండ్ సూరిగారు చిన్న మనిషైనా ఆయనది రథంలా పెద్దకారు. ఆయన తన కారు వైపు నడుస్తూంటే యేనుగుని యెక్కడానికి వెళ్తున్న యెలుకలా అనిపించారు బాలరాజుకి.

లోపలికి వచ్చాక మందాకిని అడిగింది.

'ఏటంతాడు పొట్టిగూటం?' అని.

'నాకు 'క్యూర్' హాస్పిటల్లో జాబ్ ఫిక్స్ చేశారు' చెప్పాడు బాలరాజు

'అయిబాబో - యెల్లిపోతారా డాట్రారూ - అయితే నానూ మీ యెనకే'

'అదేవిటి?'

'అవును డాట్రారూ - మీరు సానా మంచోరు. మెదడున్నోరు. మీతో పనిసేత్తే పదింతల జాబు తృత్తి'

'ఏదో నీ అభిమానం సిస్టర్.'

'అలాగనకండి. తవకాడ దయాదాచ్చిన్నేలున్నయ్.'

'మరక్కడ వేకెన్సీ వుండాలిగా నువ్వు జేరాలంటే'

'సవస్యేనేదు. మన సూరిపండుగాడున్నాడుగా, ఆడికి నేనంటే యామోవం. ఆడే సూత్తాడు'

'సరేమరి. నీలాంటి డివోటెడ్ సిస్టర్ వుంటే అంతకంటే యేం కావాలి' అన్నాడు బాలరాజు.

'మరి యీడయాబిటిక్కోల్ల గురించి అడిగేరా?'

'అడిగా అడ్వాన్స్ ట్రీట్‌మెంట్ కోసం 'క్యూర్' హాస్పిటల్‌కి ట్రాన్స్‌ఫర్స్ చేస్తున్నార్ట.'

'మరీడ మనం సేసేడిదేంటో?'

'వెళ్లి చూస్తే తెలుస్తుంది మనకి.'

'అదీ కరెస్టే. కాఫీ కలుపు కొత్తా డాట్రారూ' అని మందాకిని హుషారుగా నడిచింది.

కాఫీతాగాక బాలరాజు పని పూర్తి చేసుకుని బైటికి వచ్చాడు. ఈ విషయం యింకా రేఖకి తెలీదు. తను చెబితే యెంతో సంతోషిస్తుంది అనుకున్నాడు బాలరాజు. ఇన్నాళ్లు అలవాటయిపోయిన కె.జి.హెచ్ గోడలు దాటి వెళ్లాలంటే యేదో తెలియని వెలితిగా వుంది బాలరాజుకి.

అజంతా హోటల్ బస్ స్టాప్ దగ్గర కిళ్లీ కొట్టు అప్పలరాజు బిజీగా వున్నాడు. హిస్టరీ మేష్టారు శర్మగారు పాహియాన్‌తో యేదో మాట్లాడుతున్నారు. బాలరాజు కూడా కలిశాడు. పాహియాన్ సినిమాల గురించి మాట్లాడుతున్నాడు.

'సినిమాహాలు దగ్గరికి యిల్లు మారిపోదామా అనిపిస్తోంది' అన్నాడు పాహియాన్.

'ఎందుకో?' అడిగారు శర్మగారు.

'ఏం చెప్పమంటారూ - శతదినోత్సవాలు చేసుకునే సినిమాలు తగ్గిపోతున్నాయి. జత దినోత్సవాలు చేసుకునే సినిమాలు పెరుగుతున్నాయి. ఆ మాట కొస్తే కొన్ని యింటర్వెల్ దాకా ఆడి వెళ్లి పోతున్నాయి. ఈ మధ్య మరీ అన్యాయం. రిలీజయిన సినిమా, యింటి దగ్గర్నుంచి బైల్దేరి థియేటర్‌లోకి చేరేలోపునే వెళ్లిపోతోంది. అందుకే హాలు పక్కనే యిల్లు తీసుకుంటే సినిమాను వెళ్లిపోయేలోగా చూడొచ్చని' అని చెప్పాడు పాహియాన్.

'ఏడిసినట్టే వుంది. అంత తొరగా వెళ్లిపోయే దిక్కుమాలిన సినిమాను చూడకపోతే యేవొచ్చిందిట' అన్నారు శర్మగారు.

'మీకో న్యూస్' అన్నాడు బాలరాజు టాపిక్ మారుస్తూ.

'ఏవిటి?' అని యిద్దరూ అడిగారు.

'ఇక్కడ నా రెసిడెన్సీ అయిపోయింది. వచ్చేవారం నుండీ 'క్యూర్' హాస్పిటల్లో పనిచేయబోతున్నా' చెప్పాడు బాలరాజు.

'సరే. ఏ హాస్పిటలయితేనేం ప్రాణం తియ్యడానికి' అన్నాడు పాహియాన్. 'ఈ మధ్య డాక్టర్లంటే అందరికీ జోకే' అన్నాడు బాలరాజు.

'నువ్వు ప్రాణాలు పోసేవాడివేకాని తీసేవాడివి కావు. పాహియాన్ యేదో పరిహాసానికన్నాడంతే' అని శర్మగారు శాంతం పలికారు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

